కళాశాల విద్యార్థులకు చిన్న చిన్న కథలపోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

# గుడ్ గర్ల్

అది విశాఖపట్నంలో చౌట్రీ బస్‌స్టాప్.

అక్కడ నిల్చున్నది నేనుకాక ఇంకా చాలా మంది. సమయం సరిగ్గా సాయంత్రం 5 గంటలు. ఎదురుగా సూపర్ బజార్ చాలా అందంగా వుంది. ఆ గేటు ముందు నిల్చున్న చాలామంది అందమైన డ్రెస్‌లు వేసుకొని నడుస్తున్న మనుష్యుల్ని చాలా ఆనందంగా, జూలో జంతువుల్ని చూస్తున్నట్లు చూస్తోన్నారు. పేవ్‌మెంట్ మీద నేపాల్‌వాళ్ళు అమ్ముతున్న స్వెట్టర్లు కూడా చాలా అందంగా వున్నాయి. అప్పుడా సమయంలో రోడ్డుమీద అందమైనమనుష్యులు, అందంలేని మనుష్యులు; ఖరీదైన మనుష్యులు, ఖరీదులేని మనుష్యులు నడుస్తున్నారు—అంతే కాకుండా రిక్షాలు, ఆటోలు, సైకిళ్ళు స్కూటర్లు, బస్సులు, కార్లు, లారీలు కూడా వున్నాయి—అంత మాత్రమే కాకుండా ఒక అంబోతు, వెనక ఒక ఆవు, రెండు గేదెలు - గేదెలు తోలే మనిషి, ఒక గజ్జికుక్క, ఒక మంచి కుక్క—ఇంకా ఒక ముష్టివాడుకూడా అందమైన పాటద్వారా అడుక్కుంటున్నాడు.

అప్పుడా వాతావరణం అందంగానూ వుంది. అంద విహీనంగాను కూడా వుంది. బస్సు రాలేదు.

"టైం ప్లీజ్...." నా ప్రక్కనున్న గిరజాల యువకుడు అడిగాడు.

"5-30...." చెబుతూ చూసాను అతన్ని. అతను అటు చూస్తోన్నాడు దీక్షగా. నేను చూసాను.

అప్పుడే వస్తూంది. బస్సుకాదు — ఆ అమ్మాయి చేతిలో ప్లాస్టిక్ సంచితో. ఆమె తెల్లగా వుంది. చీర వెలిసిపోయి అందంగా లేదు. నుదురుమీద ఎర్రని తిలకంబొట్టు చాలా అందంగా వుంది. కళ్ళు దీనంగా వున్నాయి. మొత్తంమీద ఆ అమ్మాయి అందంగా లేదు, అందవిహీనంగానూ లేదు.

ఆ యువకుడు ఆమె దగ్గిరగా వెళ్ళి నిల్చున్నాడు.

అప్పుడు చూసాను అతన్ని సరిగ్గా. ఇంకా ఆమెనే చూస్తున్నాడు.

అతను గిరజాల జుట్టుతో అమితాబచ్చన్‌లా చాలా అందంగా వున్నాడు. అతను వేసుకున్న పాంటు, షర్టు ఖరీదుగానే వుండి అందాన్నిచ్చాయి. అతను పెంచుకున్న మీసాలు కమల్‌హాసన్ మీసాలలా చాలా అందంగా వున్నాయి. అతని చూపులు మాత్రం అందంగా లేవు.

ఆ అమ్మాయి అతన్నొకసారి చూసి దూరంగా జరిగింది. కాసేపటికి అతను కొంచెం దగ్గరగా జరిగాడు.

అందమైన సాయంత్రం చీకటిని పులుముకుంటూ వుంది.

అతను ఏదో అంటున్నాడు ఆమెతో. మనసు నిలవడంలేదు. దగ్గరగా నాలుగు అడుగులు వేసాను.

"ఏమండీ! ఇదేనా మనవూరు....? ఎక్కడ వుంటున్నారు...."—సమాధానం లేదు.

"ఏం చేస్తోన్నారండీ, కాలేజీలో చదువుతున్నారా....?"—సమాధానం లేదు.

"ఓ....జాబ్ చేస్తోన్నారు కదూ—ఏ కంపెనీలోనండీ....?"—సమాధానం లేదు.

"మిమ్మల్నెక్కడో చూసానండీ....అచ్చు మీలాంటి రూపాన్నే — త్రీ ఇయర్స్ బేక్!" అప్పుడు నాకు నవ్వొచ్చింది. ఆమెమీద జాలేసింది.

రాగతి రమ ఎం.ఏ. (ప్రీ)
ఆంధ్రా యూనివర్సిటీ, వాల్తేరు.

"ఏమండీ కనీసం మీ పేరైనా చెప్తారా....?" ఆమె సూటిగా అతన్ని చూసింది. ఆ చూపులో కసి, కోపం, భయం వున్నాయి. 'ఏమిట్రా ఈ గొడవ' అనే భావంకూడా వుంది.

"పోనీ లెండి నా పేరు మాత్రం పవన్" అన్నాడు.

ఈసారి నవ్వాపడం కష్టమైంది. విచిత్రంగా చూసింది ఆమె నావైపు. ఎవడో పొట్టికుర్రాడు విజిల్ వేసుకుంటూ వెళ్ళాడు వాళ్ళిద్దర్నీ చూస్తూ. వాడ్ని చూస్తేకూడా నవ్వొచ్చింది.

ఇంతలో బస్సు వచ్చింది. స్పృహ వచ్చినట్లు పరిగెత్తాను. నాలాగ ఎందరో. బస్సు కదిలింది. జారిపోతున్న కళ్ళజోడు సరిచేసుకున్నాను.

అప్పుడు కనిపించారు—పవన్, ఆమె—ఇద్దరూ ప్రక్క-ప్రక్కనే నా ముందునే!

"మీకూ టికట్ తీసుకున్నాను. మళ్ళీ తీయకండి ప్లీజ్"—అంటున్నాడు పవన్ ఆమెతో. ఆ అమ్మాయి అవస్థపడుతూ వుంది బస్సు హేండిల్స్ పట్టుకోలేక, ప్లాస్టిక్ బుట్ట పట్టుకోలేక, మీదపడే మనుష్యుల్ని తప్పించుకోలేక. రీడింగ్ రూమ్‌వద్ద దిగాను, నదిలో చేపపిల్ల ఈదినట్టు ఈది.

ఆ అమ్మాయి దిగింది బేగ్‌తో. పవన్ దిగాడు. నాకు చాలా సంతోషమైంది. ఆ అమ్మాయి సందులో తిరిగింది - వెనక పవన్- ఆ వెనుక నేను. చర్చివరకూ వచ్చాము. అక్కడ చీకటి చిక్కగా వుంది. వీధి లైటు జోగుతోంది. సడన్‌గా ఆగింది ఆ అమ్మాయి-అతను రెండు అడుగులు వెనగ్గా ఆగాడు—నేను మరో నాలుగు అడుగులు వెనగ్గా ఆగాను. ఆమె కళ్ళు చీకట్లో ఎర్రగా అనిపించాయి.

జోడు తీసి నాలుగు వాయిస్తుంది అనిపించింది.

లేదా—అదేదో సినిమాలోలా మంచి నడత గురించి దీర్ఘ ఉపన్యాసం ఇస్తోందేమో అనుకున్నాను.

"ఏయ్ మిష్టర్!....ఇలారా!!" కంఠంలో కటుకే కాక స్పష్టత వుంది. "ఇలా ఫాలో అవుతూ వస్తోన్నావ్...జీవితమంతా ఫాలో అవగలవా-చెప్పు సమాధానం.?" చాలా సౌమ్యంగా అడిగింది.

'ఏ గుడ్ గర్ల్'—అనుకున్నాను.

అక్క దండిస్తే దిక్కుమొఖం వేసుకున్న తమ్ముడిలా అనిపించాడు పవన్ .... ఏ పూర్ ఫెలో!

"పోనీ—నువ్వయితే చిన్నవాడివి....మరి ఇతనో! ఇంత పెద్దవాడై వుండి....ఇలా ప్రవర్తిస్తాడా....సిగ్గులేదూ??"

ఇతనూ అంటే—నేనేనా-చాలా సిగ్గేసింది. ఎందుకూ అంటే ఎందుకో నాకే తెలియదు. వెనక్కి తిరిగా అతని వెనకే! □

---

కళాశాల విద్యార్థులకు చిన్న చిన్న కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

# మనిషి

"ఏ క్లాసులో అమ్మాయిలు ఎంతమంది వున్నారు?" అని అడిగాడు రమణ. వాడికెప్పుడూ అమ్మాయిల గొడవే.

"వాళ్ళ గొడవ నీకెందుకుగానీ త్వరగా నడు. నాకు క్లాస్‌కి టైమ్ అవుతోంది" అన్నాను టైమ్ చూసుకుంటూ. అప్పుడే మధ్యాహ్నం పన్నెండైంది. ఒంటి గంటకు క్లాస్ వుంది.


## ఎం. వాసుదేవమురళి

గాంధీ వైద్యకళాశాల, హైదరాబాదు.


నాకు మెడికల్ కాలేజిలో సీటు వచ్చిన తరవాత రమణ హైదరాబాదు రావడం అదే మొదటిసారి. వచ్చిన దగ్గరినుంచి శవాలుకోసే గదిని చూపెట్టమని గొడవ చేస్తోన్నాడు. అందుకనే 'డిసెక్షన్ హాల్' చూపెడదామని వాడిని హాస్టల్‌నించి బయలదేరదీశాను.

'సీనియర్స్' హాస్పిటల్ నించి ఇంకా రాలే